సాక్షి
తిరుపతి
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'

అక్కచెల్లెమ్మల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి తెలిపారు. - 8లో



హోమ మండపాలు ప్రారంభం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో రుద్ర, హోమ మండపాలను సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. - 8లో



ఆదర్శంగా వేంకటపతి నగర్

తిరుపతి రూరల్‌లో వేంకటపతి నగర్ పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోందని తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి కొనియాడారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 72,256 మంది స్వామివారిని దర్శించుకోగా 28,021మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.04 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రతి అర్జీని పరిష్కరించండి



కలెక్టరేట్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: స్పందనకు వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల పెద్ద సంఖ్యలో అర్జీదారులు విచ్చేసి వినతులు అందించారు. మొత్తం 241 అర్జీలు వచ్చినట్టు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్‌డీసీలు కోదండ రామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, లాండ్ ప్రొటెక్షన్ సెల్ రాంమోహన్, కేఆర్‌ఆర్సీ ఎస్డీసీ దేవేంద్రరెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఐశా, పావని తదితరులు పాల్గొన్నారు.

24న కుమారధార తీర్థ ముక్కోటి

తిరుమల: తిరుమలలో ఈనెల 24వ తేదీన కుమారధార తీర్థ ముక్కోటి ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పర్వదినాన భక్తులు తీర్థ స్నానమాచరించి, దానధర్మాలు చేసి స్వామివారిని దర్శించుకోనున్నారు. ప్రకృతి సౌందర్యాల నడుమ కుమారధార తీర్థంలో స్నానమాచరించడాన్ని భక్తులు ప్రత్యేకంగా భావిస్తారు.

పౌర్ణమి గరుడసేవ

శ్రీవారి ఆలయంలో 24న పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. రాత్రి 7 నుంచి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు స్వర్ణకాంతులీనుతున్న గరుడునిస్వాహీనులై తిరుమాడ వీధుల్లో విహరించనున్నారు.

ఇది నా పూర్వజన్మ సుకృతం

– ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి ఘన వీడ్కోలు



ఎస్పీ నిల్చున్న జీపును తాళ్ల సాయంతో లాగుతున్న పోలీసు సిబ్బంది

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా ఎస్పీగా పనిచేసి బదిలీపై వెళ్తున్న పరమేశ్వర్‌రెడ్డికి సోమవారం పోలీస్‌శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆర్మ్‌డు రిజర్వుడు విభాగం గౌరవ పరేడ్ నిర్వహించింది. కవాత్ నిర్వహించింది. ఎస్పీని జీపులో నిల్చోబెట్టి తాడుతో లాగుతూ ఊరేగించారు. ఎస్పీ మాట్లాడుతూ తిరుపతి లాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో పనిచేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. అధికారులు, సిబ్బంది చక్కగా పనిచేశారని, సహాయ, సహకారాలు ఎప్పటికీ మర్చిపోనని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, రాజేంద్ర, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

తిరుపతి అర్బన్: 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన లక్ష్యంగా, ఫ్లోరోసిస్ వ్యాధి నివారణకు, నియంత్రణ దిశగా అధికారులు పనిచేయాలని, అన్ని గిరిజన ప్రాంతాల్లో ఈ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ జీ.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ వైద్యాధికారులతో కలిసి 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన, ఫ్లోరోసిస్ వ్యాధి నివారణ, నియంత్రణకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి, ఫ్లోరోసిస్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి సూర్యనారాయణ, డీఎంహెచ్ఓ శ్రీహరి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఐశా, పావని పాల్గొన్నారు.




దీవెనలందిస్తూ.. విద్యాజ్యోతులు వెలిగిస్తూ!

'ప్రతి బిడ్డా చదవాలి. ఇంజినీర్లు, డాక్టర్లు లాంటి పెద్దపెద్ద చదువులు చదవాలి. గ్రామానికి, దేశానికి సేవచేసే స్థాయికి ఎదగాలి. మనం బిడ్డలకు ఇచ్చే ఆస్తి చదువొక్కటే. పిల్లలందరూ ఉన్నతంగా చదువుకునేందుకు ఎన్ని అడుగులైనా ముందుకేస్తా'.. అంటూ నాడు ప్రజాసంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీని వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వినూత్న పథకాలతో విద్యా విధానాన్నే సమూలంగా మార్చేశారు. ప్రపంచంతో పోటీపడే విధంగా ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌ను తలదన్నే విధంగా తీర్చిదిద్దారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నతంగా చదువుకునేందుకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తూ విద్యా జ్యోతులు వెలిగిస్తున్నారు.

నిరుపేద విద్యార్థులకు వరం జగనన్న విద్యాదీవెన

- ప్రాథమిక స్థాయిలో అమ్మఒడి
- ఉన్నత చదువులకు విద్యాదీవెన
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



సూళ్లూరుపేట నియోజకవర్గ సమాచారం

మండలం	విద్యార్థుల సంఖ్య	జగనన్న విద్యాదీవెన మొత్తం రూ.కోట్లలో
సూళ్లూరుపేట అర్బన్	2,559	9,52,47,396
సూళ్లూరుపేట రూరల్	2,324	7,42,86,475
నాయుడుపేట అర్బన్	2,705	9,57,80,256
నాయుడుపేట రూరల్	2,557	8,51,65,478
దొరవారిసత్రం	2,253	7,77,89,594
తడ	805	2,24,83,494
పెళ్లకూరు	2,595	8,24,70,993
ఓజిలి	2254	7,88,92,686
మొత్తం	18,052	61,19,16,322

సూళ్లూరుపేట: ఒకప్పట్లో ఉన్నత చదువులు చదవాలంటే డబ్బుతో కూడిన్న పని అని నిరుపేద విద్యార్థులు చదువుకు దూరమయ్యేవారు. ఊర్లో ఉన్న బడుల్లో ఉన్నంత వరకు చదువుకుని ఆపై కూలీనాలి చేసుకుని జీవనం సాగించేవారు. దళిత, గిరిజన విద్యార్థులు చాలామంది ప్రాథమిక స్థాయిలోనే చదువుకు స్వస్తి చెప్పేవారు. లక్షలు ధారబోసి కార్పొరేట్‌లో చదువుకోలేక కుమిలిపోయేవారు. ఇలాంటి పరిస్థితులను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పూర్తిగా మార్చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చదువుకు పెద్దపీట వేశారు. ప్రతి పిల్లవాడూ చదువుకునే విధంగా బాటలు వేశారు. పాఠశాలల్లో వారికి కావాల్సిన మౌలిక వసతులతోపాటు.. బిడ్డను బడికి పంపినందుకు తల్లి బ్యాంక్ ఖాతాలో అమ్మఒడి నిధులు రూ.15 వేలు జమచేస్తున్నారు. అలాగే ఉన్నత చదువుల కోసం జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాలతో పూర్తిఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తూ అండగా నిలుస్తున్నారు. ఫలితంగా నేడు ప్రతి పిల్లవాడూ ఉన్నత చదువులు చదువుతూ తల్లిదండ్రులు బాసటగా నిలుస్తున్నారు.

అమ్మానాన్నకు ఎలాంటి ఇబ్బందీ లేదు



నేను తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఈఈఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వల్ల ఇంట్లో అమ్మానాన్నను ఆర్థికంగా ఇబ్బంది పెట్టకుండా చదువుతున్నా. మొదటి విడతలో రూ.26 వేలు, హాస్టల్‌కు రూ.10వేలు నా తల్లి బ్యాంక్ ఖాతాలో జమఅయ్యింది. ఇలా ఇప్పటికి మూడు విడతల్లో విద్యాదీవెన అందుకున్నా. సీఎం జగనన్న అందిస్తున్న విద్యాదీవెన వల్లే తల్లిదండ్రులకు భారం లేకుండా ఇంజినీరింగ్ చదువుతున్నా. జగనే మరోమారు ముఖ్యమంత్రి అయితే మాలాంటి పేదలకు ఎంతో మంచి జరుగుతుందని భావిస్తున్నా.

– మొహమ్మద్‌అక్తర్, ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థి, సూళ్లూరుపేట

మాపాప ఎంబీబీఎస్ చదువుతోంది



మాది నిరుపేద కుటుంబం. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. మా పాప మానస మొదటి నుంచి మెరిట్ స్టూడెంట్. ప్రస్తుతం కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన రావడంతో మాపై ఎలాంటి ఆర్థిక భారం పడడం లేదు. ఏడాదికి రూ.35 వేలు రీయిబర్స్‌మెంట్, వసతి దీవెన కింద రూ.15 వేలు వస్తోంది.

– వేలూరు అమరావతి, కాదలూరు, తడ మండలం

ఇది జగనన్న పుణ్యమే



నేను వలంటీర్‌గా పని చేస్తున్నా. మాకు ఇద్దరు పిల్లలున్నారు. కుమారుడు సాయి నెల్లూరులో ఇంజినీరింగ్, పాప దుర్గా సూళ్లూరుపేటలోనే ఇంటర్ చదువుతోంది. ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న నా కుమారుడికి ఇప్పటికి రెండు సార్లు రూ.39 వేల చొప్పున విద్యాదీవెన అందింది. అలాగే నా కుమార్తెకు రూ.18 వేల చొప్పున మంజూరైంది. జగనన్న విద్యాదీవెనతోనే నా ఇద్దరు బిడ్డలు సంతోషంగా చదువుతున్నారు. ఇది జగనన్న పుణ్యమే.

– నాగజ్యోతి, సూళ్లూరుపేట

మళ్లీ జగనన్నే రావాలి



మాది నిరుపేద కుటుంబం. పదేళ్ల క్రితం భర్త వెంకటయ్య మృతిచెందాడు. ముగ్గురు సంతానం కాగా.. బాధ్యత మొత్తం నాపైనే పడింది. కుమారుడు నాగేశ్వరావు సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశాడు. గత మూడేళ్ల కలిపి మొత్తం రూ.36 వేలు ఫీజు రియింబర్స్‌మెంట్ వచ్చింది. ప్రస్తుతం నాగేశ్వరరావు గూడూరులో పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్నాడు. నిజంగా చెప్పాలంటే చదువుతోనే పేదరికం దూరమవుతుందనడానికి మా కుటుంబమే నిదర్శనం. మళ్లీ జగనన్నే సీఎం కావాలి.

– ఉద్దూరు మునెమ్మ, కుమారుడు నాగేశ్వరరావు, కుప్పారెడ్డిపాళెం, దొరవారిసత్రం మండలం

బలిజ భవనం..దేవాలయంతో సమానం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్మాణం
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: బలిజ భవనం తనకు దేవాలయంతో సమానమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వంగవీటి రంగ కాలనీలో శ్రీకృష్ణదేవరాయల బలిజ భవన్ నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాపు, బలిజ సంక్షేమ సంఘం మంచి కమిటీ ఏర్పాటు చేసుకుని భవన నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. శ్రీకాళహస్తిలో అనేక సత్రాలు ఉండేవని, ఆ సత్రాలకు సంబంధించిన రికార్డులు గత పాలకుల హయాంలో మాయమయ్యాయని ఆరోపించారు. తాను గతంలో దేవుడికి పూలు సరఫరా చేసే పూలతోటను దేవస్థానంపరం చేయాలని చూస్తే రికార్డులు లేవన్నారు. భూములు, ఆస్తులకు రికార్డులు లేవని, గత పాలకుల చిత్తశుద్ధి లేమితో దేవుడు ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. బలిజ, కులస్తులు సమిష్టిగా భవన నిర్మాణం చేసుకుని ప్రతిఒక్కరూ వినియోగించుకునే విధంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, ప్రముఖులు, విశ్రాంత జడ్జి రాధాకృష్ణ, చిట్టివేలు జయగోపాల్, ఉప్పుకృష్ణయ్య, పూలకృష్ణమూర్తి, స్వర్ణమర్తి, గాజులసత్యం, చిలకా గోపి, రామకృష్ణ, మున్నారాయల్, జయశ్యామ్, పగడాల రాజు, కోలా గోవర్ధన్, చిలకా రంగయ్య, మందల బాలాజీ, అంజూరు రాజశేఖర్, తీగల భాను, పసుపులేటి కోదండం, పల్లం గోపి, జనార్దన్, కంఠా ఉదయ్, చింతామణి పాండు, సెన్నీరుకుప్పం శేఖర్, కోలా వెంకటేశ్వరరావు, ముత్యాలకృష్ణ, డీవీ నారాయణ, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బలిజ భవనం పూజల్లో ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్

ప్రణాళికతోనే ఒత్తిడి దూరం



పట్టాభిరామ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, శ్వేత సంచాలకులు భూమన్

తిరుపతి(అలిపిరి): చక్కటి ప్రణాళికతో ఒత్తిడిని అధిగమించవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బీవీ.పట్టాభిరామ్ సూచించారు. తిరుపతిలోని శ్వేత భవనంలో సోమవారం టీటీడీ ఉద్యోగులకు 'విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించడం ఎలా' అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులు ఒత్తిడిని అధిగమించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మన ఆధీనంలో లేని కొన్ని పనుల కారణంగా ఒత్తిడి పెరుగుతుందన్నారు. మన ఆలోచనలను, పని విధానాన్ని మార్చుకోవడం, ఇతరులతో గౌరవప్రదంగా మాట్లాడడం, గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవడం, ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం తదితర అంశాలు మన ఆధీనంలోనే ఉంటాయన్నారు. కుటుంబానికి మార్గదర్శకంగా ఉండాలని.. కుటుంబ సభ్యులకు తగినంత సమయం కేటాయించాలని సూచించారు. క్షమాగుణం అలవర్చుకోవడంతో మనశ్శాంతి కలుగుతుందన్నారు. అనంతరం ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్రతో కలిసి ఆయన శిక్షణకు హాజరైన ఉద్యోగులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, సీపీఎస్వో నరసింహ కిషోర్, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

పకడ్బందీగా సార్వత్రిక ఎన్నికలు

- ప్రత్యేక వ్యవస్థతోనే ఓటర్ల నమోదు ప్రక్రియ
- పారదర్శకంగా ఓటర్ల జాబితా
- 'సాక్షి'తో కలెక్టర్ లక్ష్మీశ



జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్: ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించడమే ఇప్పుడు నా ముందు ఉన్న లక్ష్యం. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే సమాయత్తమైంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదకన ప్రక్రియను ప్రారంభిస్తాం. అందులో భాగంగా ప్రత్యేక సిస్టమ్ ద్వారా పారదర్శకమైన ఎన్నికల జాబితాను సిద్ధం చేశాం. ప్రధానంగా సమస్యాత్మక ప్రాంతాలను ముందేగుర్తించే ప్రక్రియలో యంత్రాంగం నిమగ్నమైంది'అని కలెక్టర్ జీ.లక్ష్మీశ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా, పాలనతోపాటు పలు అంశాలను సోమవారం ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

సద్వినియోగం చేసుకోండి

ఓటు విలువను తెలుసుకోవాలి. ప్రధానంగా యువత ముందుకు రావాలి. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటే మీ బాధ్యత పూర్తయినట్లు భావించాలి. ప్రధానంగా తిరుపతితోపాటు పలు అర్బన్ ప్రాంతాల్లో ఓటు నమోదు శాతాన్ని గణనీయంగా పెంచాలని భావిస్తున్నాం.

ఓటు మన హక్కు

ఓటు అనేది భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు. ఆ హక్కును పొందడం అందరి బాధ్యత. ఎన్నికల నిర్వహణకు పది రోజుల ముందు వరకు ఓటు నమోదు చేసుకోవచ్చు. ఓటుకు అర్హతే ప్రామాణికం. జిల్లాలోని 34 మండలాల్లోనూ ఓటు నమోదుకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాం. 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు బాధ్యతగా ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చు.

ఓటర్లు పెరుగుతున్నారు

ఎన్నికల కమిషన్ 100 శాతం పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందిస్తోంది. ఒక ఓటు తొలగించాలన్నా.. చేర్చాలన్నా ఎలా పడితే అలా చేయడానికి కుదరదు. ఓ సిస్టమ్ ప్రకారం ఎన్నికల కమిషన్ నియమనిబంధనలు తీసుకొచ్చింది. ఆ విధంగానే అడుగులు వేస్తున్నాం. జిల్లా కేంద్రమైన తిరుపతితోపాటు సమీప ప్రాంతాల్లో ఓటర్లు పెరుగుతున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ఫోకస్

అధికార యంత్రాంగం గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలను ముందే గుర్తించే పనిలో పడింది. చేయాల్సిన ఏర్పాట్లను చకచకా చేస్తోంది. సమస్యలు పునరావృతం కాకుండా పటిష్ట ఏర్పాట్లు చేపడుతోంది. ఓటర్లతోపాటు విధులు నిర్వహించే సిబ్బంది, అధికారులకు సైతం పూర్తివసతులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

డెమో..

ఇప్పటికీ కొందరు ఓటును ఎలా వేయాలో తెలియక తికమక పడుతుంటారు. ఆ సమస్య లేకుండా ఉండేందుకు తిరుపతి కలెక్టరేట్‌తోపాటు ఆర్డీవో కార్యాలయాల్లో ఎన్నికల వరకు శాశ్వతంగా ఓట్లు ఎలా వేయాలో డెమో ఏర్పాటు చేశాం. ఇప్పటికే వందల సంఖ్యలో ఓటర్లకు డెమో ఇచ్చాం. మీరు మీ ఓటును ఓ గుర్తుకు వేస్తే.. ఆ గుర్తుకే ఓటు పడుతుందా..? అనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం.

ప్రజాసేవే ధ్యేయం

- రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తాం
- తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మల్లికా గార్గ్





గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ (ఇన్‌సెట్) మల్లికా గార్గ్, ఎస్పీ

తిరుపతి క్రైమ్: 'ప్రజాసేవే నా ధ్యేయం. సామాన్య ప్రజలకు ప్రాధాన్యతనిస్తా. మహిళలకు పెద్దపీట వేస్తా'అని నూతన జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ స్పష్టం చేశారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఆమె తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా పోలీసులు గౌరవ వందనం సమర్పించి పూర్ణకుంభంతో ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 2015లో ఐపీఎస్ అధికారిణిగా ఎంపికయ్యాని, ప్రకాశం జిల్లా ఎస్పీగా రెండు సంవత్సరాల ఏడు నెలలు పనిచేశానని తెలిపారు. అనంతరం బదిలీపై ఇక్కడకు వచ్చినట్టు వెల్లడించారు. తిరుపతిలో బాధ్యతలు స్వీకరించడం చాలాఆనందంగా ఉందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారికి శిక్షలు పడేలా చేస్తామన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీలు, వృద్ధులు, చిన్నపిల్లలకు పెద్దపీట వేస్తామన్నారు. సామాన్య ప్రజలకు సేవ చేయాలంటే చాలా ఇష్టమని తెలిపారు. పోలీస్ సిబ్బంది కూడా క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ వెల్ఫేర్‌కు కూడా తమవంతు కృషి చేస్తామన్నారు. సిబ్బందికి ఏ అవసరం వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

రానున్న ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా జరిగేలా తమ వంతు కృషి చేస్తానని ఎస్పీ తెలిపారు. ఎన్నికలపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెడతామని చెప్పారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తులకు శాంతిభద్రతల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ వంతు కృషి చేస్తామన్నారు. రానున్న రథసప్తమి వేడుకలను కూడా పటిష్ట భద్రత నడుమ నిర్వహించనున్నట్టు తెలిపారు.

హోమ మండపాల ప్రారంభం



వెండి దర్పణాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేస్తున్న నంద, కొండూరు సునీత దంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చండి, రుద్రహోమ మండపాలను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. రూ.13 లక్షల వ్యయంతో రుద్ర హోమం, చండీ హోమం మండపానికి జీర్ణోద్ధరణ పనులు చేశారు. అవి పూర్తి కావడంతో ఎమ్మెల్యే శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండపంలో మొదటి రుద్రహోమం, చండీ హోమం పూజను ప్రారంభించారు. ధర్మకర్తలమండలి సభ్యురాలు కొండూరు సునీత, నంద దంపతులు రూ.లక్ష విలువైన వెండి దర్పణాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆలయానికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, పాల్గొన్నారు.



చండి, రుద్ర హోమ మండపాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'



సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



జగనన్నకు మద్దతుగా నినాదాలు చేస్తున్న మహిళలు

తడ: అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆసరాగా నిలిచారని, వారి అభ్యున్నతికి చేపట్టిన మహా యజ్ఞాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. సోమవారం తడలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ ఆసరా నాల్గో విడత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాదయాత్ర సమయంలో వాడవాడలా వచ్చిన వినతుల మేరకు నవరత్నాల పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. కొందరు అబద్ధపు హామీలిచ్చి ఎన్నికలయ్యాక మూటకట్టి అటకమీద వేయడానికి సిద్ధంగా ఉన్నారని, అలాంటి వారిని ఎన్నటికీ నమ్మొద్దని ఆయన మహిళలకు సూచించారు. ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదురైనా ఇచ్చిన మాట కోసం, చెప్పిన వాగ్దానాలు నెరవేర్చేందుకు కంకణం కట్టుకున్న ధీరుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు మోసపూరిత మాటలకు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన డ్వాక్రా మహిళలను ఒడ్డుకు చేర్చిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఆసరా కార్యక్రమం ద్వారా నాలుగు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేశారని తెలిపారు. తడ మండలంలోనే 733 సంఘాల్లోని 7,615 మంది సభ్యుల ఖాతాల్లో 26 కోట్ల 20 లక్షల రూపాయలు జమచేశారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతున్నంతసేపు మహిళలు కేరింతలు, కరతాళ ధ్వనులతో ప్రభుత్వానికి, సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, సంజీవయ్యకు మద్దతుగా నిలిచారు. కార్యక్రమం చివర్లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆసరా నాలుగో విడత మెగా చెక్కును ఆవిష్కరించారు. ఎంపీపీ కే.రఘురెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు ఇందుమతి కార్తిక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.ఆర్ముగం, మండల జేసీఎస్ కన్వీనర్ ఆర్‌కే. సుందర్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ తిరుమలైరెడ్డి, నాయకులు టీ.కోదండం, టీ.శశికుమార్, నత్తం శ్రీనివాసులు, ఎంపీడీఓ ఆమోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని మేఘనకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న డీఈఓ శేఖర్

రేణిగుంట: ఇన్‌స్పైర్ మనక్-2023-24 రాష్ట్ర స్థాయి పోటీలకు రేణిగుంట మండలం, గాజులమండ్యం విద్యార్థిని ఎంపికయ్యారు. శ్రీకాళహస్తిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో గాజులమండ్యానికి చెందిన శ్రీసాయి గణేష్ విద్యాలయం విద్యార్థిని పీ.మేఘన ప్రదర్శించిన ×ఇన్‌సెక్ట్ ట్రాపింగ్ ఫర్ అగ్రికల్చర్÷ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు డీఈవో శేఖర్ విద్యార్థినిని అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యార్థినికి స్కూల్ యాజమాన్యం చెంచురెడ్డి, జువ్వల ధనంజయరెడ్డి అభినందనలు తెలిపారు.

ఎంబీయూలో వర్క్‌షాప్



మాట్లాడుతున్న డాక్టర్ శివరామకృష్ణారెడ్డి

చంద్రగిరి: మండల పరిధిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో సోమవారం బేసిక్ లైఫ్ సపోర్ట్ అనే అంశంపై పారామెడికల్ కళాశాల విద్యార్థులకు వర్క్‌షాప్‌ను దాసరి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమరాన్ ఆస్పత్రి ఎమెర్జెన్సీ హెచ్ఓడీ డాక్టర్ శివరామకృష్ణారెడ్డి విచ్చేసి, ప్రసంగించారు. దైనందిన జీవితంలో మనిషికి అనుకోకుండా శ్వాస ఇబ్బంది, కళ్లు తిరగడం, బీపీ పెరగడం లేదా తగ్గడం వంటి వాటి వల్ల గుండె సమస్య ఏర్పడుతుందన్నారు. అలాంటి సమయంలో మనిషిని ఎలా కాపాడుకోవాలో ఆయన వివరించారు. కార్యక్రమం పారామెడికల్ హెచ్ఓడీ డాక్టర్ మానస్ చక్రవర్తి, ఎంబీయూ రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, అధ్యాపకులు, ఫిజియోథెరపీ విభాగధిపతి డాక్టర్ చంద్రకళాధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ముక్కంటి సన్నిధిలో ఇటలీ దేశస్తులు



ఆలయం వద్ద ఇటలీ దేశస్తులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం 15మంది ఇటలీ దేశస్తులు దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందన్నారు.

కామాంధుడిని శిక్షించండి

నాయుడుపేట టౌన్: బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం.. పట్టణానికి చెందిన బాబు(55) తన ఇంటికి సమీపంలో ఉన్న తొమ్మిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి యత్నించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ఆపై విషయం కాలనీ వాసులకు తెలియడంతో అందరూ గుమికూడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. కామాంధుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఏకాంబరం(ఫైల్)

చంద్రగిరి: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి ఐతేపల్లి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తిరుపతి ఐఎస్ మహల్ వద్ద గల నెహ్రూనగర్‌కు చెందిన ఏకాంబరం(32) ఆదివారం తన స్వగ్రామమైన పూతలపట్టు మండలం, కిచ్చన్నగారిపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అనంతరం అర్ధరాత్రి సమయంలో తిరిగి ఇంటికొస్తుండగా.. ఐతేపల్లి వద్ద వెనుక వైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఏకాంబరం అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాదిలోనే అభివృద్ధి చేశా!



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: ప్రజలు ఎమ్మెల్యేను చేస్తే.. గెలిచిన నాలుగేళ్లు వెంకటగిరి అభివృద్ధిని మరచి ×నాకేంటి.. నాకు ఎంత వాటా..? అనే ధోరణిలోనే ఆనం రామనారాయణరెడ్డి గడిపేశారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని తన నివాసంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వెంకటగిరి ప్రజాప్రతినిధిని అని ప్రస్తుత సభలకు హాజరవుతున్న ఎమ్మెల్యే ఆనం గత నాలుగేళ్లుగా వెంకటగిరికి దూరంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. గత నాలుగేళ్లలో వెంకటగిరిలో ఆనం చేయలేని అభివృద్ధి ఏడాదిలో తాను చేసి చూపించినట్లు తెలిపారు. మించాంగ్ తుఫాన్ సమయంలో వెంకటగిరి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎందుకు స్పందించ లేదని నిలదీశారు. బాలాయపల్లి మండలంలో జరిగిన సమావేశంలో గంగ జలాల విడుదలపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల శ్రేయస్సు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల రైతాంగానికి తాగు, సాగునీరు కావాలని అడిగిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీచేసి, నీటిని విడుదల చేశారని గుర్తుచేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రెండు సార్లు సాగునీరు విడుదల చేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అన్నారు. 5వ బ్రాంచ్ కెనాల్ ద్వారా 179 చెరువుల కింద 31,838 ఎకరాల ఆయకట్టు ఉందని, దీని పరిధిలో ప్రస్తుతం 6వేల ఎకరాల వరకు వరి పంట సాగుచేసినట్లు తెలిపారు. 100 ఎకరాలకు 60 క్యూసెక్కుల చొప్పున నీరు సరిపోతుందని, కానీ అదనంగా 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని నేదురుమల్లి స్పష్టం చేశారు. డక్కిలి మండలంలో మంగళవారం జరిగే విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. డక్కిలి మండల కన్వీనర్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు దశరథరామిరెడ్డి, వేణునాయుడు, జీ.శ్రీనివాసులనాయుడు, నాయకులు బొల్లంపల్లి కృష్ణ, మల్లికార్జున్‌రెడ్డి, కోళ్లపూడి వేణుగోపాల్, మాజీ ఎంపీపీ చెంచయ్య, నారాయణరెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న తమిళనాడు రేషన్ బియ్యం

సూళ్లూరుపేట: పట్టణంలోని బొగ్గుల కాలనీకి చెందిన గోవిందమ్మ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన 115 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యాన్ని సోమవారం సెబ్, సివిల్ సప్లైయ్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. రామ్మూర్తినాయుడు అనే వ్యక్తి గత కొంతకాలంగా గోవిందమ్మ ఇల్లు అద్దెకు తీసుకుని తమిళనాడు నుంచి వస్తున్న రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసేవాడు. తర్వాత ఆ బియ్యాన్ని గోతాలు మార్చి రైస్ మిల్లర్లకు, నెల్లూరుకు తరలించి సొమ్ము చేసుకునేవాడు. దీనిపై ముందుగా అందిన సమాచారం మేరకు పై రెండు శాఖల అధికారులు దాడులు చేసి 5,750 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై గోదాముకు తరలించి, రామ్మూర్తినాయుడుపై కేసు నమోదు చేసినట్టు సెబ్ సీఐ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ఈ దాడుల్లో సివిల్ సప్లై డీటీ డీ.ఓబయ్య కూడా పాల్గొన్నారు.

రేపటి నుంచి దక్షిణ భారత సంగీత నృత్యోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం నుంచి 16వ తేదీ వరకు మహతి కళాక్షేత్రంలో కళావైభవం పేరిట దక్షిణ భారత సంగీత, నృత్యోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావు, పసుమర్తి రామలింగ శాస్త్రి వంటి ప్రముఖుల ఉపన్యాసం ఉంటుంది. శ్రీకృష్ణ లీలా విలాసం, శ్రీరామ కథాసారం, భక్త ప్రహ్లాద యక్షగానం వంటి నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఈ మేరకు టీటీడీ డీఈవో ఎం.భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఆదర్శంగా వెంకటపతి నగర్



నూతన సచివాలయ భవనంలో పూజలు చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, సర్పంచ్ చిన్నియాదవ్

- 40 ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- గ్రామ కంఠం నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్లు
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో వెంకటపతి నగర్ పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోందని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో 40 ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. గ్రామకంఠం నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయని వివరించారు. సోమవారం పంచాయతీ పరిధిలో రూ.42 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ విజ్ఞాపన మేరకు ప్రహరీ గోడ నిర్మాణానికి కూడా అప్పటికప్పుడే ఆమోదం తెలుపుతూ అధికారులకు సిఫార్సు చేశారు. అంతేకాకుండా సాయివెంకట్, సాయి ధరణి, లక్ష్మీనారాయణ, వర్ష విశ్వనాథ లేవుట్ లలో రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన బోరు, పైప్‌లైన్ తదితరాలను ప్రారంభించారు. తాటితోపు ప్రధాన రహదారి నుంచి వేంకటపతినగర్ రైల్వే బ్రిడ్జి వరకు రూ.33 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు పూర్తయ్యాయని, త్వరలో అన్నీ ప్రారంభిస్తామని సర్పంచ్ చిన్నియాదవ్ తెలిపారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి పంచాయతీ ప్రజలు రుణపడి ఉంటారని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎంపీపీ వేముల యశోద, జెడ్పీటీసీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీటీసీ నారాయణమ్మ, పార్టీ సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.